## వర్షాలు కురువాలని పూజలు



ఆరెగూడెంలో బొడ్రాయికి పూజలు చేస్తున్న మహిళలు

చౌటుప్పల్ రూరల్, జూన్30 : వర్షాలు కురవాలని చౌటుప్పల్ మండలంలోని ఆరెగూడెంలో ఆదివారం బొడ్రాయికి పూజలు చేశారు. మహిళలు బిందెల్లో ఊరేగింపుగా నీళ్లు తీసుకొచ్చి అభిషేకం చేశారు. కప్పలను కర్రకు కట్టి గ్రామంలో ఊరేగించారు. చౌటుప్పల్ మండలంలో వర్షాలు కురవక పంట లు ఎండిపోతుండడంతో గ్రామ దేవతలకు పూజలు చేసినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునగాల అమరేందర్‌రెడ్డి, కొంతం శ్రీనురెడ్డి, గంగబోయిన నర్సింహా, బొగ్గు అంజయ్య, పిసాటి ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# రైతు బంధుకు కొర్రీలు!

- పెట్టుబడి సాయం అందే రైతుల సంఖ్య కుదింపు
- ఈ వానకాలం నుంచి ఐదెకరాలలోపు రైతులకే అందజేసేలా చర్యలు
- పీఏసీఎస్‌లలో రైతులతో సహకార, వ్యవసాయ అధికారుల సభలు
- ఐదెకరాలలోపే సాయం ఇవ్వాలని రైతులతో చెప్పిస్తున్న యంత్రాంగం
- జూలై 4వరకు అభిప్రాయ సేకరణ.. సర్కారుకు నివేదిక
- ఎకరాకు రూ.15వేలు ఇస్తే పెట్టుబడి సాయం పెరుగుతుందని ప్రభుత్వం కుట్రలు





నల్లగొండ, జూన్ 30 : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అధికారం చేపట్టిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పంట పెట్టుబడి సాయం కోసం రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టి 11 దఫాలుగా అందజేయగా.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొర్రీలు పెడుతూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నది. రైతు బంధు పథకాన్ని రైతు భరోసాగా మార్చిన రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడుతలోనే ఎన్నో ఆపసోపాల మధ్య ఇచ్చింది. ప్రస్తుత వానకాలం రెండో విడుతలో పంపిణీ చేయాల్సి ఉండగా పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. ఐదెకరాల్లోపు ఉన్న రైతులకే పెట్టుబడి సాయం అవసరమని, మిగతా వారికి అవసరం లేదని నిర్ణయించి.. ఈ విషయం తాము కాదు రైతులే అంటున్నారని అబద్ధపు మాటలను ప్రజల ముందు ఉంచాలనే కుట్రతో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాథమిక సహకార సంఘాల్లో సహకార, వ్యవసాయ శాఖ అధికారులతో సర్వసభ్య సమావేశాలు నిర్వహించి ఐదెకరాలపైనున్న వారికి రైతుభరోసా ఇవ్వద్దని రైతులే అంటున్నారనే కుట్రలకు తెర తీసింది. జూన్ 29 నుంచి జూలై 4వరకు ఈ అభిప్రాయ సేకరణ పూర్తి చేసి ఐదెకరాలలోపు ఉన్న రైతులకే పెట్టుబడి సాయం ఇచ్చే విధంగా సర్కారు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తున్నది. ఎన్నికల హామీల్లో ఇచ్చిన దానికి అనుగుణంగా ఏడాదికి ఎకరాకు రూ.15వేలు ఇవ్వాల్సిన నేపథ్యంలో పెట్టుబడి సాయం గణనీయంగా పెరుగుతుందని ఆలోచించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

### పెట్టుబడి సాయం తగ్గేలా చర్యలు

పంట పెట్టుబడి సాయం వల్ల ప్రభుత్వంపై ఎక్కువ భారం పడకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నారనే విమర్శలు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి వస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 వానకాలం నుంచి 2023 వానకాలం సీజన్ వరకు 11 దఫాలుగా రైతుబంధు అందజేసింది. తొలుత సీజన్‌కు ఎకరాకు రూ.4వేలు ఇచ్చిన కేసీఆర్ సర్కార్ ఆ తర్వాత రూ.5వేల చొప్పున ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత యాసంగి సీజన్‌కు సాయం విడుదల చేసింది. అది కూడా పలు విడుతల్లో రైతుల ఖాతాల్లో జమచేయడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఈ వానకాలం సీజన్ సాయం ఇవ్వకుండా ఆపి అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ అభిప్రాయ సేకరణ తర్వాత వానకాలం పెట్టుబడి సాయం ఐదెకరాలలోపు ఉన్న రైతులకే ఇచ్చే అవకాశం ఉంది.

### ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా రైతుల నుంచి అభిప్రాయ సేకరణ

రైతు బంధు పథకాన్ని రైతు భరోసాగా మార్చిన కాంగ్రెస్ సర్కారు ఈ పథకం కింద ఐదెకరాలలోపు ఉన్న రైతులకే పెట్టుబడి సాయం ఇవ్వాలని కుట్రలు చేస్తున్నది. ఈ విషయాన్ని ప్రభుత్వమే నేరుగా చెపితే వ్యతిరేకత మూటగట్టుకుంటామనే ఆలోచనతో రైతులే ఐదెకరాల లోపు ఉన్న వారికి ఇవ్వాలని అంటున్నారని నమ్మబలకడానికి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలుస్తున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 107 ప్రాథమిక సహకార సంఘాల్లో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. జిల్లా సహకార శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతుల అభిప్రాయ సేకరణలో జిల్లా సహకార అధికారి, ఆడిట్ అధికారి, వ్యవసాయ అధికారుల సమక్షంలో జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఈ ముగ్గురు అధికారులు ఆయా జిల్లాలో మూడు చొప్పున మొత్తం మూడు జిల్లాల్లో 27 సమావేశాల చొప్పున ఈ నెల 4వరకు 107 ప్రాథమిక సహకార సంఘాల్లో అభిప్రాయ సేకరణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. ఆయా సమావేశాల్లో రైతులతో మాట్లాడిస్తున్నప్పటికీ పెద్ద రైతుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండానే ఐదెకరాలలోపే పెట్టుబడి సాయం కావాలని రైతులు అంటున్నారని అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తుంటడం గమనార్హం.

### రైతుల అభిప్రాయాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నాం



ప్రభుత్వం రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి మినిట్స్ రూపంలో రికార్డ్ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. దాంతో జిల్లాలో ఉన్న ప్రాథమిక సహకార సంఘాల్లో సర్వ సభ్య సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నాం. ఆయా సంఘాల్లో సభ్యులు ఉన్న రైతులకు ముందే సమాచారం అందజేసి వారి నిర్ణయాలు తీసుకుంటున్నాం. రైతులు మాత్రం ఐదెకరాల లోపు ఉన్న వారికి రైతు భరోసా ఇవ్వాలని అంటున్నారు.

**– పాల్వాయి శ్రవణ్ కుమార్, వ్యవసాయ అధికారి, నల్లగొండ**

### కేసీఆర్ ఇచ్చిన మాదిరిగానే రైతుబంధు ఇవ్వాలి



గత ప్రభుత్వంలో అప్పటి సీఎం కేసీఆర్ ఇచ్చిన మాదిరిగానే రైతుబంధు ఇవ్వాలి. కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో రైతుబంధు ఇవ్వడం లేదు. గత యాసంగిలో ఆలస్యంగా వేశారు. ప్రస్తుతం వానకాలం మొదలైనా ఇప్పటి వరకూ ఇవ్వలేదు. దాంతో అప్పులు తెచ్చి పంటలు సాగు చేయాల్సి వస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఎకరాకు 7,500 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయింది. కాంగ్రెసోళ్లు పంట వేసిన భూమికే పెట్టుబడి సాయం ఇస్తామంటే ఎట్లా. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చినట్లుగానే రైతుబంధు అందజేయాలి. కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలి.

**– శేఖర్‌రెడ్డి, రైతు, చిన్నసూరారం, నల్లగొండ మండలం**

### కాంగ్రెస్ రైతులను మోసం చేసినట్లే..



ఎన్నికల ముందు అందరికీ రైతు బంధు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలో చేపట్టిన తర్వాత కొర్రీలు పెడుతున్నది. ఐదు ఎకరాలు, పది ఎకరాల వరకే ఇస్తామని చెప్పడం మోసం చేసినట్లే. గత ప్రభుత్వం ఎకరానికి 5 వేలు సకాలంలో రాగా కాంగ్రెస్ 7.500 వేల రూపాయలు ఇస్తామని చెప్పి కాలయాపన చేస్తున్నది. దాంతో రైతులు అప్పులు తెచ్చి వ్యవసాయం చేయాల్సి వస్తున్నది. గత ప్రభుత్వం మాదిరిగా ప్రతి ఎకరాకూ రైతు బంధు ఇవ్వాలి.

**– అలుగుబెల్లి సుధాకర్‌రెడ్డి, మంచినీళ్లబాయి, కనగల్ మండలం(నల్లగొండ సిటీ)**


హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శినికి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

## యాదగిరీశుడిని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

యాదగిరిగుట్ట, జూన్30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు ఆలయ సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికి స్వామివారి వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈఓ భాస్కర్‌రావు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అలాగే వనపర్తి ఎమ్మెల్యే శ్రీమేఘారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మెమొంటోలు అందించిన జిల్లా సెక్రటరీ టి.రంగారావు, జిల్లా కోచ్ ఎం.రామకృష్ణ

## రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

మిర్యాలగూడ, జూన్ 30 : పట్టణంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన బ్యాడ్మింటన్ అండర్ -15, 17 విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో పలువురు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు జిల్లా సెక్రటరీ టి.రంగారావు, జిల్లా కోచ్ ఎం.రామకృష్ణ తెలిపారు. నల్లగొండ అండర్ -15 విభాగంలో టి.అక్షిత్‌రెడ్డి, వి.మణిశంకర్, చందన, వెంకటసాయివైష్ణవి, అలీ, కార్తికేయ, మనోజ్ఞ, రిధా హస్మి.. అండర్ -17లో ఎస్.అఖిలేశ్‌గౌడ్, అన్విత్‌నిహాల్‌రెడ్డి, చందన, లిల్లిగ్రేస్, హారిక, చైత్ర.. సూర్యాపేట జిల్లా అండర్-15లో యశస్విని, శ్రీలాస్య, అనసూజ, అక్షర, అభినవ్, సంతోష్, గౌతమ్, సంతోష్.. అండర్-17లో ఎం.అభిరామ్ వర్మ, ఎన్.అభిరామ్, శ్రీలాస్య, యశస్విని, కీర్తన, అభినవ్, తేజస్విని, హారిక ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మిర్యాలగూడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్, జిల్లా ఉపాధ్యక్షుడు టి.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల 30న జూనియర్ బ్యాడ్మింటన్

మిర్యాలగూడ పట్టణంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 30న నల్లగొండ, సూర్యాపేట జిల్లాల జూనియర్ బ్యాడ్మింటన్ అండర్ -15, 17 (బాల, బాలికల) క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు మిర్యాలగూడ డీఎస్‌ఏ బ్యాడ్మింటన్ కోచ్ ఎం.రామకృష్ణ గురువారం తెలిపారు. ఎంపికైన అండర్ 15 క్రీడాకారులను జూలై 14 నుంచి 17వరకు మెదక్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో, అండర్ 17లో ఎంపికైన క్రీడాకారులు జూలై 23 నుంచి 26వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే ఎంపిక పోటీలకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

## శిఖం ఆక్రమణదారులకు నోటీసులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నిడమనూరు, జూన్ 30 : మండల కేంద్రంలోని నల్లచౌట చెరువు శిఖం ఆక్రమణ దారులకు నీటి పారుదల శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 14న నమస్తే తెలంగాణ మినీలో ' చెరువు శిఖంలో ఆగని ఆక్రమణలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిఖం లో ఆక్రమణలకు పాల్పడిన 30 మందిని గుర్తించి నోటీసులు జారీ చేశారు. చెరువు శిఖం సర్వేకు సైతం నీటిపారుదల శాఖ నుంచి తాసీల్దార్‌కు లేఖను సైతం రాశారు. అలాగే ముప్పారం, సోమోరిగూడెం, ముప్పారం నర్లకంటి చెరువు శిఖం ఆక్రమణల నేపథ్యంలో నోటీసులు జారీ చేసినట్లు ఏఈ ప్రవీణ్‌రాజు తెలిపారు. సర్వే అనంతరం ఆక్రమణలను నిర్ధారించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## బాలసాహిత్య పురస్కారం

నల్లగొండ సిటీ, జూన్ 30 : కనగల్ మండలం చిన్న మాదారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాలసాహితీ వేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి పెందోట బాల సాహిత్య పురస్కారం లభించింది.సిద్దిపేటలోని శ్రీవాణి సాహిత్య పరిషత్తు ,పెందోట బాల సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దశమ వార్షికోత్సవ సమావేశంలో ముఖ్య అతిథి సామ సువర్ణదేవి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. బాల సాహిత్యానికి చేస్తున్న సేవతో పాటు బుచ్చిరెడ్డి రాసిన 'బంతిపూలు' అనే పుస్తకానికి ఈగౌరవం లభించింది.


ఘటోత్కచ వేషధారణలో కళాకారుడు

## అలరించిన మాయాబజార్ నాటకం

యాదగిరిగుట్ట, జూన్30 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వినాయక నాట్య మండలి సురభి వారి నాటక ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. చివరిరోజు మాయాబజార్ నాటకం అత్యంత భక్తి పూరితంగా సాగింది. పలు కళాకారులు శ్రీకృష్ణుడు, బలరాముడు, అభిమన్యుడు, నారదుడు, ఘటోత్కచుడు, హిడింబి, శశిరేఖ, రేవతి, రుక్మిణి, సత్యభామ, జాంబవతి, మిత్ర విందా వంటి వివిధ వేషాలతో భక్తులను అలరించారు. ముగింపు సందర్భంగా వినాయక నాట్య మండలి నిర్వాహకులను ఆలయ డీఈఓ భాస్కర్‌శర్మ, ఏఈఓ శ్రవణ్‌కుమార్ సన్మానించి, స్వామివారి ప్రసాదం, ధ్రువపత్రాలను అందజేశారు.


అనునిత్యం మన ఆరోగ్య పరిరక్షణకై శ్రమిస్తున్న వైద్యులందరికి డాక్టర్స్ డే శుభాకాంక్షలు



















